క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురంలోని ఎస్‌బీఎస్‌బీ అవతార్ అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అపార్ట్‌మెంట్ అనుకొని ఉన్న ఓపెన్ నాలా కారణంగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యుత్ సమస్య, ఓటర్ కార్డులలో చిరునామా మార్చాలని వారు కోరారు. తన దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలను త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, నాయకులు బూరుగడ్డ నగేష్, వెంకట్ రెడ్డి, పరమేష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్,రాజిరెడ్డి, పాండులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

సంగారెడ్డిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మొదటి విడత అడ్మిషన్ 2023–24/25కు ఉత్తర్వులు జారీ చేసినట్లు పటాన్‌చేరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఆన్‌లైన్‌లో మే 17 నుంచి జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు టెన్త్, కుల ధ్రువీకరణ దరఖాస్తుకు జతచేయాలన్నారు. తెలంగాణలో చదవి ఉంటే వారిని స్థానికులుగా పరిగణిస్తారన్నారు. టెన్త్ మెమో టీసీ ఆధార్, ఆన్‌లైన్‌లో పాస్‌పోర్ట్ సైజు ఫొటో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. http:// iti. telangana. gov. in వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

ఇంటి పన్నులు తగ్గించండి



మాట్లాడుతూన్న విద్యుత్‌నగర్‌కాలనీ వాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటి పన్నులను తగ్గించాలని కోరుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి విద్యుత్‌నగర్ కాలనీవాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడారు. ఎక్కడా లేనివిధంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అనేకమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. పక్కనే ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీకి ఇక్కడ ఇంటి పన్ను ఎందుకు వ్యత్యాసం ఉందని ప్రశ్నించారు. ఈ విషయంపై అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నరని మండిపడ్డారు. సమస్యను వెంటనే పరిష్కారించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వీఓఏల వినూత్న నిరసన




తహసీల్దార్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న వీఓఏలు

జహీరాబాద్ టౌన్: డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న వీఓఏలు శుక్రవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం సమ్మె శిబిరం వద్ద మహిళా వీఓఏలు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. సీఎం కేసీఆర్ స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని బతుకమ్మను వేడుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శులు మహిపాల్, రాజిరెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు అశోక్, ముస్తఫా పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

కల్హేర్(నారాయణఖేడ్): వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కల్హేర్‌లో ఐకేపీ వీఓఏలు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో వీఓఏలు శ్రీనివాస్, నాగరాజు, జబ్బర్, శివరాం, బాలయ్య, షేర్ అలీ, లింగం , అపర్ణ, రుక్మిణి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలి



శిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

జహీరాబాద్ టౌన్: సీఎం కేసీఆర్ ఆలోచనలో రూపుదిద్దుకున్న పథకం కంటి వెలుగని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ గుప్తా అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో వాసవి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు పేదలకు ఉపయోగపడుతుందన్నారు. వార్డు ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జహీరాబాద్‌లో సీఎంచిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



పటాన్‌చెరులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో శుక్రవారం సీఎం చిత్ర పటానికి వీఆర్‌ఏలు పాలాభిషేకం చేశారు. క్యాబినెట్ సమావేశంలో వీఆర్‌ఏలను క్రమబద్ధీకరణ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పై వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు అంజన్న, మధుకర్, నాగేష్, పాండు, యాదుల్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పటాన్‌చెరు: దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అత్యుత్తమ వేతనాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల వీఆర్‌ఏల ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పూర్తిస్థాయిలో పర్మనెంట్ చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు.

జహీరాబాద్ టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని ప్రకటించిడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు బస్వరాజ్, జైపాల్, దత్తు, యాజాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసి రెగ్యులర్ పేస్కేలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. కోహీర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

రాయికోడ్(అందోల్): వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. 23 వేల మంది వీఆర్‌ఏల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు వీరేందర్, అశోక్‌కుమార్, శివకుమార్, శ్రీశైలం, సుజాత, దుర్గయ్య, నయూమ్, కయూమ్, విఠల్, అశోక్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ఇంటింటికి తాగునీరు



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఇంటింటికి తాగునీరు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వనిదేనని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతసాగర్, వెంకటాపూర్, లింగాపూర్, నమ్లిమెట్, నిజాంపేటలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే జూకల్ శివారులోని మార్కెట్ యార్డులో ప్లాట్ ఫామ్స్, మూత్రశాలలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సువర్ణషెట్కార్, వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఫణివర్మ, ఏఈ అబ్దుల్ హన్నన్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరచారి పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు సైనికులు

కల్హేర్(నారాయణఖేడ్): పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు సైనికులని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం గౌడ్‌గాంలో బీఆర్‌ఎస్ క్రియశీల కార్యకర్త మేస్త్రి భారతి మరణించడంతో ఆమె భర్త, నామిని కమ్మరి తుకారాంకు పార్టీ తరపున రూ.2 లక్షలు బీమా చెక్కు అందజేశారు. బీబ్యతండా, మున్నా తండా మీదుగా ఇరక్‌పల్లి వరకు రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులతో వేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

సిర్గాపూర్ మండలం వాసర్‌కు చెందిన అశోక్‌రావు పాటిల్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం



సదాశివపేటలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రస్తుత రాజకీయ నాయకులకు పదవులపై ఆశ తప్ప ప్రజాసంక్షేమం పట్టని వారు ఉన్నారని, సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యల గురించి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఖయ్యుం, మల్లేశం, ఆంజనేయులు, శివకుమార్, సఫియాబేగం, బిస్మిల్లా, అమీనా తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): సామాజిక న్యాయం సాధించడంతోనే దేశాభివృద్ధి చెందుతుందని, కులం, మతం పక్కనపెట్టి అందరూ ఐకమత్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 38 వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్, సుధాకర్‌గౌడ్, ముత్యాలు బుజ్జమ్మ, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తామని కమ్యూనిస్టు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని హైద్లాపూర్, మల్లారెడ్డిపేట, మల్లికార్జునపల్లి గ్రామాల్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జోగిపేట(అందోల్): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. సాయిలు అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతిని జోగిపేట కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు రాములు, మల్లయ్య, విజయ, మాణిక్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.రాంచందర్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం శిబిరం నిర్వహిచారు. కార్యక్రమంలో పార్టీ సంగారెడ్డి కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

మునిపల్లి(అందోల్): ఈ నెల 22వ తేదీ మునిపల్లిలో జరగబోయే ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర నాయకుడు సాయికుమార్, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులను కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దగోపులారం, గొర్రెగట్టు, మునిపల్లి, పొల్కంపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీలపల్లి సర్పంచ్ వీరన్న పాటిల్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు బాగన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలం గంజిపేటలో 13 రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిసాయి. గ్రామానికి చెందిన మొండెద్దులు సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవడు మొండెద్దుల నటరాజ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన పోటీలు ప్రారంభించారు. పోటీల్లో 26 జట్లు పాల్గొన్నాయి. మ్యాచ్ చివరి రోజు శివం పేట గ్రామానికి చెందిన ఎస్‌ఎస్ స్టార్, అంబేడ్కర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఎస్‌ఎస్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది . మ్యాన్ ఆఫ్ ద సిరీస్ శివంపేట గ్రామానికి చెందిన మన్నె క్రాంతి కుమార్ దక్కగా, రూ.5 వేల నగదు, ట్రోఫీ అందుకున్నారు. ముగింపు పోటీలకు సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుబ్బారెడ్డి హాజరై విన్నర్ జట్టుకు ట్రోఫీ, రూ.25 వేలు నగదు, రన్నరప్‌కు రూ.15 వేలు నగదు అందజేశారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

జోగిపేట మున్సిపల్ ఛైర్మన్ జి.మల్లయ్య



జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

జోగిపేట(అందోల్): ఇళ్లల్లో ఉపయోగంలేని వస్తువులను మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రియూస్, రీసైకిల్) సెంటర్‌లో అప్పగించాలని జోగిపేట–అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య సూచించారు. శుక్రవారం జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రజల నుంచి సేకరించిన వస్తువులను అవసరం ఉన్న వారికి అందజేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ట్రిపుల్ ఆర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ 'స్వచ్ఛ సర్వేక్షన్'' లో భాగంగా ×మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్'ట్రిపుల్ ఆర్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సెంటర్లు ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో వుంటుందన్నారు. కార్యక్రమం సోమవారం నుంచి రోజుకొక వార్డు చొప్పున నిర్వహించ బడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్‌కుమార్, మెప్మ సీ.ఓ.భిక్షపతి, రిసోర్సు పర్సన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జలవనరులకు నష్టం కలిగిస్తే చర్యలు

నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ఆనంద్



పటాన్‌చెరు టౌన్: జలవనరులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన ఇతర అధికారులతో కలసి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వెంచర్లను స్వయంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రెయిన్‌బో వెంచర్‌లో కట్టుకాలువ కబ్జా అయ్యిందని, అసలు కాలువను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇంకార్ వెంచర్ లో కమిటీ ఇచ్చిన సూచనల మేరకు డ్రెయిన్ బాక్స్ నిర్మాణం వెంటనే చేయాలన్నారు. సీతారామపురం కాలనీలో ఉన్న బఫర్ జోన్ లో ప్రహరీ ఉందని దాన్ని వెంటనే తొలగించాలన్నారు. నీటిపారుదల డీఈ నళిని, ఏఈ పావని తదితరులు పాల్గొన్నారు.

కిచ్చన్నపల్లి ఆలయ పూజారి మృతి

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని కిచ్చన్నపల్లిలోని ఉత్తర తిరుమలగా పేరుగాంచిన వేంకటేశ్వర ఆలయ పూజారి కోవిల్ కందాడై అనంతాచార్యులు(80) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న భక్తులతో పాటు పలువురు ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా శివ్వంపేట



అన్నం వడ్డిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రానున్న కాలంలో ఆధ్యాత్మిక కేంద్రంగా శివ్వంపేట నిలుస్తుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యేకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదానం..

దివంగత రామవ్వ అంజయ్యగుప్తా జ్ఞాపకార్థం వారి కుమారుడు పబ్బ రమేశ్‌గుప్తా ప్రతీ అమావాస్య రోజు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. అందుకు సంబంధించి అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ, ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇక్కడ బగలాముఖి ఆలయ నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మన్సూర్, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జంలా తండాలో కంటి వెలుగు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేట జంలా తండాలో శుక్రవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. 204 మందికి కంటి పరీక్షలు చేశామని సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు అరవింద్, పీహెచ్ఎన్ నిర్మల, సిబ్బంది సరిత పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అఖీల, సర్పంచ్ నర్సమ్మ, ఉపసర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ శనీశ్వరుడికి పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో శుక్రవారం అమావాస్యతో పాటు శనీశ్వర జన్మోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మహేష్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి శనీశ్వరునికి తైలాభిషేకాలు, అనంతరం రామలింగేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగ్గా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారన్నారు.

◆ పారిశుధ్య పనులు ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభించారు. మన్సూర్‌పూర్ వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలను ట్రాక్టర్ జోజర్‌తో తొలగించారు. మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పనులను మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

◆ బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లో బీరప్ప ఆలయం నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. శనివారం గణపతిపూజ, అఖండ దీపారాధన, దేవతా ఆవాహనం, బీరప్ప విగ్రహాల ఊరేగింపు, 21న రుద్రహోమం, ధాన్యాధివాసం, 22న హోమం, యంత్ర ప్రతిష్ఠ, బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ, బీరప్ప కల్యాణం, 23న బీరప్పకు బోనాలు సమర్పిస్తారని ని ఆలయ నిర్వహకులు తెలిపారు.

◆ ఘనంగా ఎమ్మెల్యే దంపతుల వివాహ వార్షికోత్సవం



పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, యాదమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో పటాన్‌చెరు మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు.

◆ నిర్మలాజగ్గారెడ్డిని కలసిన నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డీసీసీ అధ్యక్షురాలిగా రెండవసారి నియమితులైన నిర్మలాజగ్గారెడ్డిని శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నేతలు సంగారెడ్డిలో కలశారు. ఆమెను కలిసిన వారిలో కౌన్సిలర్ పావని, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్.రవీందర్, మాజీ ఉప సర్పంచ్ పర్సా శ్యాంరావు, నరసింహులు ఉన్నారు.

◆ మంచి ఫలితాలు రావడం ఆనందంగా ఉంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం వెలిమెల మోడల్ పాఠశాలలో 10జీపీఏ సాధించిన విద్యార్థిని ఎస్.జననిని ఆయన సన్మానించారు.

◆ బీసీలకు ప్రాధాన్యం

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసి వారికి ప్రాధాన్యం కల్పిస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, శాసనమండలి వైస్‌చైర్మన్ బండప్రకాష్‌ను నీలం మధు మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ బీసీలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా కృషిచేస్తున్నారన్నారు.

◆ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో శనివారం చౌటకూర్ మండల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ చౌటకూర్ మండల అధ్యక్షుడు గాజుల వీరేందర్ , సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు కిష్టారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆత్మీయ సమావేశాన్ని సరాఫ్‌పల్లి పీపీఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ జైపాల్ రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

◆ ఇప్పెపల్లి సొసైటీ వైస్ చైర్మన్‌కు సన్మానం



జహీరాబాద్ టౌన్: ఇప్పెపల్లి సొసైటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన తొట్టితండాకు చెందిన హరిసింగ్‌ను తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్) నాయకులు సన్మానించారు. పట్టణంలోని బంజార భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను పూలమాలలువేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, జహీరాబాద్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఎస్ఎంఆర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ఎస్ఎంఆర్ యువసేన ముందుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లికు చెందిన విశ్వకర్మ సంఘం ఇన్‌చార్జి నారాయణాచారి ఎస్ఎంఆర్ యువసేనలో చేరారు. ఆయన మాట్లాడారు. ఎస్ఎంఆర్ యువసేన చేస్తున్న సేవ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది యువసేనలో చేరుతున్నారని తెలిపారు.